TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 20 13-6-2025 శుక్రవారం పేజీలు : 4 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, M Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri

# అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం..

## ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

### భయానకం చెల్లాచెదురుగా మృతదేహాలు, శకలాలు
### విమాన ప్రమాదంలో 242 మంది ప్రయాణీకులు, 14 మంది మెడికోస్ దుర్మరణం (12-6-2025)



**(సందేశం టైమ్స్) జూన్ 12:** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విజయవాడ నుంచి అహ్మదాబాద్ చేరుకున్నారు. అక్కడికి చేరిన వెంటనే ఆయన ప్రత్యక్షంగా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఘటన స్థితిగతులపై అధికారుల నుంచి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని భరోసా ప్రమాద స్థలానికి వెళ్లిన రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఈ దుర్ఘటన దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతిలోకి నెట్టిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా మద్దతుగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వెంటనే సహాయక బృందాలు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక దళం రంగంలోకి దిగడం వల్ల మరిన్ని ప్రాణనష్టాలు తలెత్తకుండా నివారించగలిగామని పేర్కొన్నారు. అమిత్ షా పరిశీలన, కేంద్ర స్థాయి సమీక్ష ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా స్పందించారు. ఆయన కూడా అహ్మదాబాద్ చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని సహాయక చర్యలు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్ని కోణాల్లో విచారణ జరిపి ఘటనకు గల కారణాలను త్వరితగతిన వెలుగులోకి తేయాలని సూచించారు.

## ఏడేళ్లలో రూ.2,148.45 కోట్లు

### బతుకమ్మ చీరల పథకానికి గత ప్రభుత్వ ఖర్చు ఇది
### సహ చట్టం కింద వివరాలు



హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూన్ 12 : గత ప్రభుత్వ హయాంలో 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24వరకు బతుకమ్మ చీరల పథకం కోసం ప్రభుత్వం రూ.2,148.45కోట్లు ఖర్చు చేసినట్టు చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. ఈ పథకం కోసం ఎక్కడ చీరలు కొన్నారు? టెండర్లలో పేర్కొన్న ధరలు, సరఫరా చేసిన సంస్థల వివరాలను యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ అధ్యక్షుడు పల్నాటి రాజేంద్ర సమాచార హక్కు చట్టం కింద కోరగా.. ప్రభుత్వం ఏడేళ్లలో ఈ పథకం కోసం చేసిన ఖర్చు వివరాలను తెలియజేసింది. బతుకమ్మ చీరల పథకం కింద ప్రభుత్వం 2017-18లో రూ.222.48 కోట్లు, 2018-19లో రూ.280 కోట్లు, 2019-20లో రూ.303.50 కోట్లు, 2020-21లో రూ.317.81 కోట్లు, 2021-22లో రూ.333.14కోట్లు, 2022-23లో రూ.340కోట్లు, 2023-24 లో రూ.351.52 కోట్లు ఖర్చు చేసినట్టు పేర్కొంది.

## ఏకకాలంలో ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల నిర్మాణం?

### దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం.. రీజినల్ రింగు రోడ్డుపై సీఎం సమీక్ష



**దక్షిణభాగం అలైన్‌మెంట్‌పై కీలక సూచనలు**
**త్వరలో కేంద్రానికి నివేదిక**
**కేంద్రం ఆలస్యం చేస్తే హెచ్ఎండీఏతో నిర్మాణంపై ఫోకస్..!**

హైదరాబాద్,(సందేశం టైమ్స్) జూన్ 12 : రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర, దక్షిణ మార్గాలు ఒకేసారి నిర్మించే అవకాశాలపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గురువారం ఆర్ఆర్ఆర్ ఉత్తర/ దక్షిణ మార్గాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. దక్షిణ భాగంలో అలైన్‌మెంట్ ప్రాథమికంగా ఖరారైందని ఆయనకు అధికారులు తెలిపారు. దీనిపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేసి కేంద్రానికి నివేదించాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు సమాచారం. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంతోపాటు దక్షిణ భాగం నిర్మించాలని కోరుతూ పలుమార్లు ప్రధాని మోదీ, కేంద్ర రవాణశాఖ మంత్రి నితిన్ గడ్కరీలకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి పత్రాలు సమర్పించారు.

మిగతా 2లో...

## సీఏలు ఆర్థిక ప్రణాళికలో భాగస్వాములు

### చిన్న వ్యాపారాల అభివృద్ధికి దోహదపడాలి: భట్టి



హైదరాబాద్,(సందేశం టైమ్స్) జూన్ 12 : చార్టెర్డ్ అకౌంటెంట్లు(సీఏలు) ప్రభుత్వ ఆర్థిక ప్రణాళికలో భాగస్వాములు కావాలని, చిన్న వ్యాపారాల ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నగరంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో గురువారం

మిగతా 2లో...

## మా నేతలకూ మంత్రివర్గంలో స్థానం కల్పించండి

### నామినేటెడ్, పార్టీ పదవుల్లో అవకాశమివ్వండి
### మహేశ్ గౌడ్‌ను కోరిన వివిధ కుల సంఘాలు



మిగతా 2లో...

## ఉన్నతంగా విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దాలి

### విద్యార్థుల ఖాతాల్లో కాస్మొటిక్ చార్జీలు జమ: పొన్నం



మిగతా 2లో...

# ఏకకాలంలో ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల నిర్మాణం?

ఒకవేళ ఉత్తర భాగంతోపాటు దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ నిర్మాణంపై కేంద్రం ఆలస్యం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన అంశాలపై కీలకంగా సీఎం సమీక్షించారు. దక్షిణ భాగ నిర్మాణానికి ఎప్పుడు ఆమోదం తెలుపుతారన్న విషయమై కేంద్రం నుంచి స్పష్టత తీసుకోనున్నారు. ఈ విషయంలో జాప్యం చేస్తే.. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) పరిధిలో నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అలా నిర్మాణం చేపడితే తీసుకోవాల్సిన చర్యలు, ఆర్థికాంశాలపై అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేసినట్లు వినికిడి.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుంది

## మెదక్ డి ఇ ఓ శ్రీ రాధాకిషన్



సందేశం టైమ్స్ -సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12జూన్ మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల్ పరిధిలోనీ ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి శ్రీ ప్రో డ రాధా కిషన్ సందర్శించడం జరిగింది. ముస్లాపూర్, బైరన్ దిబ్బ బర్దిపూర్, ముస్లాపూర్ తాండ, గ్రామాలకు సంబంధించిన విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుంది. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు రెండు జతలు, నోట్ బుక్స్ అందజేస్తున్నాము. తల్లిదండ్రులకు భారం కాకుండా ప్రభుత్వం రుణత్మక విద్య అందిస్తుంది దీనిని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరినారు. తల్లిదండ్రుల సమావేశానికి మంత్ర ఫౌండేషన్ వారు నిక్షిత్ అని పరిశీలకులు హైదరాబాదు నుండి రావడం జరిగింది తల్లిదండ్రుల సమావేశాల నిర్వహణను పరిశీలించారు. సమావేశ నిర్వాణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులకు సూచనలు చేశారు పాఠశాల విద్యార్థులకు పాఠ పుస్తకాలు, దుస్తులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఎంఈఓ ధనంజయ్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ లక్ష్మణ్, పంచాయతీ కాలే దర్శి, నాగరాజు, అంగన్వాడి కార్యకర్తలు, పిఎస్ హెచ్ఎం, పాఠశాల ఏ ఏ పి సి చైర్మన్ ఇప్పరాద, ఉపాధ్యాయులు సంజీవయ్య, జనార్ధన్, ఆంజనేయులు, రాజరత్నం, రుక్మిణి, సంతోష్, శ్రీకాంత్, క్రాంతి రాధిక దేవానంద్, యాదయ్య, దుర్గయ్య, జయమ్మ, సంధ్య రాణి, సరిత తదితరులు పాల్గొన్నారు

# ఉన్నతంగా విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దాలి

హైదరాబాద్, (సందేశం టైమ్స్) : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్యకర ఆహారం, వసతులు కల్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని బీసీ సంక్షేమశాఖ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వేసవి సెలవుల తర్వాత బీసీ గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమైన నేపథ్యంలో గురువారం బీసీ సంక్షేమశాఖ అధికారులతో మంత్రి పొన్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించడంతోపాటు రాష్ట్రం, దేశం గర్వ పడేలా ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లతోపాటు ఉద్యోగులంతా క్షేత్రస్థాయిలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఈ ఏడాది నుంచి విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోనే కాస్మొటిక్ చార్జీల జమ చేసేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# సీఏలు ఆర్థిక ప్రణాళికలో భాగస్వాములు

శిల్ప కళా వేదికలో జరిగిన సీఏ విద్యార్థుల జాతీయ స్థాయి సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు.సీఏలు తమ ప్రతిభను సంపాదనకే కాకుండా సేవకు వినియోగించాలని, సామాజిక తనిఖీలు చేయాలని అన్నారు.

సీఏ విద్యార్థులు భవిష్యత్తులో సొంత సంస్థలు స్థాపించే అవకాశాలుంటాయని, ఉద్యోగులుగా కాకుండా ఉద్యోగ దాతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతుందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, రీజనల్ రింగ్ రోడ్డు వంటి భారీ ప్రాజెక్టులు చేపడుతుండడంతో పాటు అనేక పరిశ్రమలకు కేంద్రంగా ఉందని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులు పుస్తకాల పంపిణీ చేసిన

## అనంతగిరి మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు



సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిల సింగారం గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాల నందు 1 తరగతి నుండి 5వ తరగతి వరకు తెలంగాణప్రభుత్వంఉచితపాఠ్యపుస్తకాలు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు యూనిఫామ్ పంపిణీ చేసి అనంతగిరి మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వారు అందించే ఉచిత యూనిఫామ్ పాఠ్యపుస్తకాలు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని మరియు ప్రభుత్వ స్కూళ్లలో విద్య అభ్యసించాలని వారు సూచించారు ఇట్టి కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ బావ సింగ్, సీనియర్ ఉపాధ్యాయులు పోటుశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి గద్దె రామారావు, వీరబోయిన సైదులు, అంగన్వాడి సిబ్బంది, వి బి కే సిబ్బంది, సంఘ బంధం లీడర్లు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# మా నేతలకూ మంత్రివర్గంలో స్థానం కల్పించండి

హైదరాబాద్, జూన్ 12 (సందేశం టైమ్స్)): తమ వర్గం నేతలకు క్యాబినెట్‌లో స్థానం కల్పించడంతో పాటు నామినేటెడ్, పార్టీ కీలక పదవుల్లో అవకాశం కల్పించాలంటూ వివిధ కుల సంఘాల నేతలు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్‌తో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నేతృత్వంలో కురుమ, గొల్ల కులాల ప్రతినిధులు భేటీ అయ్యారు. ప్రభుత్వంలో తమ వర్గానికి ప్రాతినిధ్యం లభించలేదంటూ గొల్ల, కురుమ ప్రతినిధులు ఈ సందర్భంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో గొల్ల, కురుమలు లేకుండా క్యాబినెట్ ఏర్పడలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో గొల్లలు 22 లక్షలు, కురుమలు 6 లక్షలకు పైగా ఉన్నారన్నారు. కురుమ, గొల్లలకు ఓ మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారు, ఒక ఎమ్మెల్సీతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, కమిషన్ సభ్యుల పదవులతో పాటు పార్టీ ముఖ్య పదవులను ఇవ్వాలని బీర్ల కోరారు. గొల్ల, కురుమల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని.. పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని మహేశ్ గౌడ్ హామీనిచ్చారు. తమ సామాజిక వర్గం నేత, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాసకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు మహేశ్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. 33 జిల్లాలకు చెందిన మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు మహేశ్ గౌడ్‌తో భేటీ అయ్యారు. పీసీసీ కార్యవర్గంలోనూ తమ వర్గం నేతలను అధిక సంఖ్యలో నియమించాలని కోరారు.

# నూతన గృహా ప్రవేశం చేసిన మంత్రి శ్రీహరి

మక్తల్,(సందేశం టైమ్స్) జూన్ 12 : తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి ఇవాళ మినిస్టర్ క్వార్టర్స్ లో గృహప్రవేశం చేశారు. మంత్రి డా. వాకిటి శ్రీహరి హైదరాబాదు లోని మినిస్టర్స్ క్వాటర్స్ లో ప్రభుత్వం కేటాయించిన ఇంటి నెంబర్ 1లో కేటాయించగా, డా.వాకిటి శ్రీహరి, లలిత దంపతులు వేదపండితుల వేదమంత్రోశ్చరణల మధ్య నూతన గృహప్రవేశం చేశారు. అనంతరం హోమం, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



భూత్పూర్,(సందేశం టైమ్స్)జూన్ 12 : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి నిరంతరం పోరాడుతోందని దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మునిసి పాలిటీ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసి, మాట్లాడారు. దేశంలో రోల్ మోడల్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చి దిద్దాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నియోజవర్గానికి 3500 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. భూత్పూర్ మండలానికి 404 ఇళ్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలిపారు. అంతకుముందు భూత్పూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, ఎంపీడీవో ప్రభాకర్‌చారి, తహసీల్దార్ కిషన్‌నాయక్ పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తో సొంతింటి కల సాకారం

దేవరకద్ర : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదల సొంతింటి కల సాకారం అవుతోందని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వివిధ గ్రామాల లబ్ధిదారులు 330 మందికి ప్రొసీడింగ్‌లు అందజేసి, మాట్లాడారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, నరసింహరెడ్డి, మార్కెట్ చైర్మన్ కథలప్ప, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మికాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఫారుక్‌అలీ, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.హన్వాడ : మండలంలోని బుద్ధారం గ్రామంలో కాంగ్రెస్ మండల నాయకుడు సుధాకర్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కార్యదర్శి రాఘవేందర్‌తో కలసి ప్రొసిడింగ్‌లు అందించారు.

# సుడి చెరువుకు కాలుష్య గండం

## పరిశ్రమ నుంచి నేరుగా చెరువులోకి వ్యర్థ పదార్థాలు

## చనిపోతున్న చేపలు 8 ఆందోళనలో మత్స్యకారులు.. ఆయకట్టు రైతులు



భూత్పూర్,(సందేశం టైమ్స్) : మండలంలోని పాతమొల్గర గ్రామ శివారులో ఉన్న సుడి చెరువులో పరిశ్రల నుంచి వచ్చిన కాలుష్యపు నీటితో చెరువు కలుషితమైందని ఆయకట్టు రైతులు, మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లుగా ఈ చెరువులో కలుషిత నీరు చేరుతోందని, ఈ విషయం పరిశ్రమల వారికి చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు పైభాగంలో వెంకటేశ్వర ఇండ్రస్టీ అనే పరిశ్రమ (పేపర్ తయారీ కంపెనీ) ఉంది. అయితే ఈ కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను బయటికి వెళ్లి పోవడానికి ప్రత్యేక ట్యాంకు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఆ నీటిని సుదూర ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా వ్యర్థ పదార్థాలను చెరువుకు వెళ్లె పాటు కాల్వలో వదిలేయడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి: చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగవాణి



మహబూబాబాద్, (సందేశం టైమ్స్) జూన్ 12 : బడీడు పిల్లలను బడులు చేర్పించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగవాణి అన్నారు. గురువారం మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి నెహ్రూ సెంటర్ వరకు ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కోర్టు న్యాయమూర్తుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవాణి మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలను ప్రతి ఒక్కరిని బడిలో ఉండే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని బాలలు చదువుకుంటేనే దేశ భవిష్యత్తు మంచిగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులను పనులకు పంపకుండా బడులకు పంపించాలని అప్పుడే విద్యార్థులు శారీరకంగా మానసికంగా ఉల్లాసంగా ఉంది ప్రగతికి దోహదపడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాదులు ఐసీడీఎస్ సిబ్బంది అంగన్వాడీ టీచర్లు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి



బెల్లంపల్లి (సందేశం టైమ్స్) జూన్ 12 : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్వో సుధాకర్ నాయక్ వైద్య సిబ్బందిని కోరారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తీ, సుభాష్ నగర్ బస్తీలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్బీఎస్కే, ఎంపీహెచ్ఏ, ఆశ, ఐసీటీసీ, ఎమ్ఎస్ఐసీటీసీ కౌన్సెలర్, ఎన్డీవో పీఎం, బృందం సభ్యులు ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు మరింతగా పెంచి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వంద రోజుల పాటు శిబిరాలు కొనసాగుతాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి ఇవాంజెలిన్, ఆర్బీఎస్కే టీమ్ వైద్యుడు జుబేర్, రుక్మిణి, దిశ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నీలిమా, డెమో వెంకటేశ్వర్లు, మొబైల్ ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ అలేఖ్య, కౌన్సెలర్ శ్రీలత, ఐసీటీసీ కౌన్సెలర్ జగన్మోహన్, ప్రగతి చందన , ప్రాజెక్ట్ వర్క్ మేనేజర్ వెంకటేష్, శశికాంత్, లియాబ్, టెక్నీషియన్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంఈఓ శ్రీనివాస్



కథలాపూర్, (సందేశం టైమ్స్) జూన్ 12 : విద్యార్థులు అందరూ ప్రభుత్వం అందించే అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి లోకిని శ్రీనివాస్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరికొండ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫామ్స్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలన్నారు. బాగా చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని. పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వనతడుపుల రవికుమార్, చంద్రశేఖర్, అనిత శ్రీనివాస్, విజయ, అశోక్, కవిత, సళావుద్దీన్. సిఆర్పి విజయ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇదో రకం సైబర్ మోసం

### మున్సిపల్ కమిషనర్ పేరుతో దుకాణాదారులకు ఫోన్లు




సిద్దిపేట,(సందేశం టైమ్స్)జూన్ 12 : సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త అవతారం ఎత్తుతూ ప్రజలను దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సిద్దిపేట పట్టణ మున్సిపల్ కమిషనర్ పేరిట ఆయా షాప్‌ల యజమానులకు ఫోన్ చేస్తూ ట్రేడ్ లైసెన్స్ ఫీజ్ బకాయిలు చెల్లించాలని, లేనియెడల పెనాల్టీ పడుతుందని బెదిరింపు కాల్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.
సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని పలు షాపుల యజమానులకు 7780110865 ఫోన్ నెంబర్‌తో మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నా అంటూ ఫోన్లు చేసి వెంటనే ట్రేడ్ లైసెన్స్ ఫీజు బకాయిలు మేం పంపించిన సానర్‌కు చెల్లించాలని బెదిరించారు.
దీంతో వ్యా పారులు స్థానిక కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మ దృష్టికి తీసుకెళ్లడంతో మున్సిపల్ అధికారులను ఆరా తీశారు. దీంతో మున్సిపల్ అధికారులు తాము ఎవరికీ ఫోన్ చేయలేదని, అలాంటి ఫోన్ కాల్స్‌కు ఎవరూ స్పందించవద్దని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మాట్లాడారు. ఫేక్ కాల్స్ పట్ల వ్యాపారులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నా రు. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల బకాయిలు వ్యాపారు లు, దుకాణాదారులు మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్‌లో లేదా బిల్ కలెక్టర్‌కు చెల్లించాలన్నారు. మున్సిపాలిటీ నుంచి ఎలాం టి క్యూఆర్ కోడ్లను ఏర్పాటు చేయలేదన్నారు. వ్యాపారులు ప్రజలు ఇలాంటి ఫేక్ కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలన్నారు.

# మంచినీళ్లు మహాప్రభో!

*కదంబాపూర్‌లో నీటి కటకట*

*మూలకుపడ్డ మానేరు నీటి సరఫరా పథకం*

*పేరుకుపోయిన విద్యుత్ బిల్లు.. కాలిపోయిన కరెంట్ వైర్*

*ఇరువై రోజులుగా నిలిచిన సరఫరా*

*పట్టించుకోని అధికారులు*




పెద్దపల్లి, (సందేశం టైమ్స్)జూన్ 12 : సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ మంచినీటి కోసం అల్లాడున్నది. తలాపునే మానేరు ప్రవహిస్తున్నా బిందెడు నీటిని వాడుకోలేని దుస్థితిలో మగ్గుతున్నది. ప్రజల కనీస అవసరాల కోసం గత ప్రభుత్వ హయాంలో అప్పటి సర్పంచ్ ప్రత్యేక చొరవ చూపి మానేరు తీరంలో ప్రత్యేకంగా బావిని తవ్వి, ట్యాంకులను నిర్మించి పైప్‌లైన్లు ఏర్పాటు చేయగా, ఇన్నాళ్లూ నీటికి ఢోకా లేకుండా పోయింది. అయితే అధికారుల నిర్లక్ష్యం, పంచాయతీలో నిధుల లేమితో నీటి సరఫరా పథకం మూలకుపడింది. %విద్యుత్ బిల్లులు దాదాపు 60వేల నుంచి 70వేల దాకా పేరుకుపోవడం, మరోవైపు విద్యుత్ వైరు కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు చేయించేవారు లేక, బకాయిపడ్డ బిల్లు చెల్లించేందులు నిధులు లేక 20 రోజులుగా సరఫరా నిలిచిపోగా, ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. ఇటీవల గ్రామం పరిధిలోని గొల్లపల్లెలో బీరయ్య పండుగ, ఖాసీంపల్లిలో బక్రీద్ పండుగ జరిగిన సందర్భాల్లో పెద్ద సంఖ్యలో బంధువులు రాగా, నీళ్లు సరిపోక అవస్థలు పడ్డారు. అయితే ఇంటింటికీ మిషన్ భగీరథ కనెక్షన్ ఉన్నా రెండు, మూడు బిందెలే నీళు వస్తుండడంతో సరిపోవడం లేదని, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి మానేరు నుంచి నీటి సరఫరా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు. లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వినోద్ కృష్ణను సంప్రదించగా, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే విద్యుత్ బిల్లులు చెల్లించి, వైరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు.

## పాల్వంచలోని హొటల్స్‌పై రైడ్.. డొమెస్టిక్ సిలిండర్ల పట్టివేత



పాల్వంచ,(సందేశం టైమ్స్)జూన్ 12 : పాల్వంచ పట్టణంలోని రెస్టారెంట్లు, హొటల్స్, టీ స్టాల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్, కర్రీ పాయింట్ సెంటర్లపై సివిల్ సప్లయ్ డిప్యూటీ తాసీల్దార్ శ్రీనివాసరావు రైడ్ చేశారు. ఈ సందర్భంగా కమర్షియల్స్ గ్యాస్ సిలిండర్లకు బదులుగా గృహ అవసరాలకు వాడే సిలిండర్లను ( డొమెస్టిక్) వాడటాన్ని గుర్తించి 35 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. 12 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఏజెన్సీ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

## 90 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం.. యాచారంలో దారుణం



యాచారం,(సందేశం టైమ్స్) జూన్ 12 : హైదరాబాద్ శివారు యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. బుధవారం అర్ధరాత్రి 90 ఏళ్ల వృద్ధురాలిపై దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు. సీఐ నందీశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి గ్రామంలో 90 ఏళ్ల ఓ వృద్ధురాలు బుధవారం అర్ధరాత్రి తన ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో కొంతమంది దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. మద్యం మత్తులో ఆమెపై దాడికి ఒడిగట్టారు. ఈ క్రమంలో ఆమె ప్రతిఘటించడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. గురువారం తెల్లవారుజామున చుట్టుపక్కల వారు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆరా తీశారు. అనంతరం వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలిపై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితులను పట్టుకునేందుకు పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులను గ్రామస్తులు కోరారు.

# “ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్” కోర్సులో యువతకు ఉచిత శిక్షణ...

ఏలూరు, (సందేశం టైమ్స్) జూన్12: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్”కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి. యల్.టి.సి సహాయ సంచాలకులు కె.రామచంద్రరావు గారు ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్ టర్మ్ కోర్స్ క్రింద “ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండిషనర్”కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ కు దరఖాస్తులు కోరుతున్నామని, పదో తరగతి ఆపైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు:9493482414 నెంబర్ ను సంప్రదించవచ్చున్నారు.

# అమ్మాయిలు బయట జాగ్రత్తగా ఉండండి.. రాయపాటి శైలజ సూచన




అనంతపురం,(సందేశం టైమ్స్)జూన్ 12 :: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఓ యువతి హత్య, మరో బాలికపై సామూహిక అత్యాచారం ఘటనలపై మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ స్పందించారు. జిల్లా పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ.. అమ్మాయిలు కూడా జాగ్రత్తగా చూసుకోవాలి... ఏమైనా ఉంటే తల్లిదండ్రులకు చెప్పుకోవాలని అన్నారు. కాలం బాగోలేదని... బయట జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సత్యసాయి జిల్లాలో మైనర్‌పై రెండేళ్లుగా లైంగిక దాడికి పాల్పడ్డారన్నారు. ఈ దారుణ ఘటనలో నిందితులను పట్టుకున్నామని.. మొత్తం 16 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. రామగిరి దళిత మైనర్ బాలిక ఘటనలో పార్టీలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. అలాగే తన్మయి కేసులో మొదట బాలు అనే యువకుడిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారని.. అందుకే బాలుపై పోలీసులు దృష్టి పెట్టారని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు.

సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరిలో దళిత బాలికపై రెండేళ్లుగా కొంతమంది అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై కొందరు రెండేళ్లుగా అత్యాచారం చేస్తున్నారు. దీనిని బాలిక తల్లిదండ్రులు పంచాయతీ పెద్దల దృష్టికి తీసుకురాగా.. బాలికకు న్యాయం చేయాల్సిన ఆ పెద్దలు కూడా ఆమెపై అత్యాచారం చేశారు. అంతే కాకుండా బాలికకు రెండు సార్లు అబార్షన్లు కూడా చేయించారు. ఇంతటితో ఆగకుండా బాలిక కుటుంబాన్ని కొండగుట్టల్లో దాచారు. ఎట్టకేలకు మైనర్‌కు జరిగిన అన్యాయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థిని దారుణ హత్య

మరోవైపు అనంతపురం జిల్లాలో తన్మయి అనే ఇంటర్మీడియట్ విద్యార్థిని హత్య ఉదంతం కూడా సంచలనం సృష్టించింది. తన్మయి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఉరవకొండ ప్రధాన రహదారిలో కూడేరు వద్ద మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు తన్మయి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఆ మృతదేహం తమ కుమార్తెదే అని గుర్తించిన పేరెంట్స్ బోరున విలపించారు. అయితే తన్మయిని నరేష్ అనే వ్యక్తి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. తనని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడం వల్లే తన్మయి తలపై బీర్ బాటిల్‌తో కొట్టి నరేష్ హత్య చేశాడని పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయ్యింది. అయితే మందు బాబులకు అడ్డాగా మారిన ముళ్లపొదల్లో తన్మయి డెబ్ బాడీ ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నరేష్‌తో పాటు మరికొంత మంది కలిసి తన్మయిని హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన ఈ రెండు ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా సీరియస్ అయ్యారు. ఈ రెండు కేసుల్లో నిందితులను వదలొద్దని, కఠిన శిక్ష పడేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# ఎరుపు, తెలుపు.. రెండింటిలో ఏ రంగు ఉల్లిపాయలను తింటే మంచిది..?



(సందేశం టైమ్స్)జూన్ 12 : ఉల్లిపాయలు లేకుండా అసలు ఎవరూ వంట చేయరు. వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటారు. రోజూ చేసే కూరల్లో ఉల్లిపాయలు కచ్చితంగా ఉండాల్సిందే. కొందరు ఉల్లిపాయలను రోజూ పచ్చిగానే తింటుంటారు. మజ్జిగతో రైతా వంటివి చేస్తే పచ్చి ఉల్లిపాయలను కట్ చేసి వేస్తారు. ఇంకా అనేక విధాలుగా ఉల్లిపాయలను ఉపయోగిస్తారు. అయితే మనకు మార్కెట్‌లో రెండు రకాల ఉల్లిపాయలు లభిస్తాయన్న సంగతి తెలిసిందే. ఒకటి ఎర్ర ఉల్లిపాయలు కాగా రెండు తెల్ల ఉల్లిపాయలు. చాలా మంది రెండు రకాల ఉల్లిపాయలను వాడుతుంటారు. అయితే ఆరోగ్యం విషయానికి వస్తే ఏవి ఎక్కువ పోషకాలను కలిగి ఉంటాయి..? వేటిని వాడితే మనకు మిక్కిలి ప్రయోజనం కలుగుతుంది..? అని చాలా మందికి సందేహాలు ఉంటాయి. దీనికి పోషకాహార నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

ఎర్ర ఉల్లిపాయలు..

ఎర్ర ఉల్లిపాయల్లో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. వీటి వల్లే ఉల్లిపాయలకు ఎరుపు రంగు వస్తుంది. ఆంథోసయనిన్స్ యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. ఇవి బ్లూబెర్రీలు, బ్లాక్ బెర్రీలు, ఎరుపు రంగు క్యాబేజీ, ఎరుపు రంగులో ఉండే ఇతర కూరగాయలు, పండ్లలోనూ ఉంటాయి. ఆంథో సయనిన్స్ గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గుండెను రక్షిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి రక్షిస్తాయి. కణాలు దెబ్బ తినకుండా చూస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు. ఎరుపు రంగు ఉల్లిపాయలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల గుండెకు ఎక్కువగా మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

తెల్ల ఉల్లిపాయలు..

తెలుపు రంగు ఉల్లిపాయల్లో క్వర్సెటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. తెల్ల రంగు ఉల్లిపాయలను తినడం వల్ల ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. అయితే ఈ రెండు ఉల్లిపాయలు వేటికవే ప్రత్యేకమైనవి. నిర్దిష్టంగా ఒకే రకానికి చెందిన ఉల్లిపాయలను తినాలని చెప్పలేమని పోషకాహార నిపుణులు అంటున్నారు. ఆరోగ్య ప్రయోజనాలను పొందాలంటే రెండు రకాల ఉల్లిపాయలను తినాల్సిందేనని వారు అంటున్నారు. అందుబాటులో ఉన్న రకాన్ని బట్టి తినవచ్చని వారు సూచిస్తున్నారు.

వేటిని తినాలి..?

ఉల్లిపాయలను పచ్చిగా తింటే అనేక పోషకాలను పొందవచ్చు. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా చూస్తాయి. శరీరంలోని వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. ఉల్లిపాయల్లో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఏ రకం ఉల్లిపాయలు అయినా సరే ఎంతో మేలు చేస్తాయి. వీటిని రోజూ పచ్చిగా తింటుంటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. అనేక రకాల బి విటమిన్లు కూడా ఉల్లిపాయల్లో ఉంటాయి. కనుక ఎరుపు లేదా తెలుపు ఎవరికి ఇష్టం వచ్చిన రంగులో ఉన్న ఉల్లిపాయలను అయినా సరే తినవచ్చు. రెండింటి వల్ల కూడా ఆరోగ్య ప్రయోజనాలే కలుగుతాయి.

# రైల్లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం


బాసర, (సందేశం టైమ్స్) జూన్ 12 : కాచిగూడ – నగర్సోల్ రైల్లో బాసర రైల్వేస్టేషన్ వద్ద మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన గురువారం బాసర రైల్వే స్టేషన్ లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మహారాష్ట్రలోని ధర్మబాద్ మండలం కర్కెల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరి (32) నిజామాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది మహారాష్ట్ర లోని కర్కెల్లి గ్రామానికి వెళ్ళడానికి నిజామాబాద్ లో కాచిగూడ నాగర్సోల్ రైలు ఎక్కింది.

రైల్లో పురిటినొప్పులు అధికమవ్వడంతో బాసర రైల్వే స్టషన్ అధికారులను కుటుంబ సభ్యులు అప్రమత్తం చేశారు. దీంతో రైల్వే పోలీస్ సురేష్,



స్టేషన్ మేనేజర్ రవీందర్ వెంటనే స్పందించి స్థానిక అంబులెన్స్ కు కాల్ చేసి 108 అంబులెన్స్ లో బైంసా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్సు పైలెట్ నవీన్ తెలిపారు. సకాలంలో స్పందించిన రైల్వే అధికారులకు, సిబ్బందికి, ప్రయాణీకులకు దంపతులు అభినందనలు తెలిపారు.

# వేడి సెగలు.. ఏకంగా 52 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు



న్యూఢిల్లీ (సందేశం టైమ్స్)జూన్ 12 : దేశంలోకి రుతుపవనాలు ప్రవేశించి చాలా రోజులైంది. అలాగే జూన్ మాసం కూడా సగం రోజులైపోతుంది. కానీ ఉష్ణోగ్రతల్లో మాత్రం మార్పు రాలేదు. కొన్ని రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడుతుంటే.. ఇంకొన్ని రాష్ట్రాల్లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. తీవ్ర వడగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా దేశ రాజధాని ఢిల్లీ లో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఢిల్లీలో ప్రస్తుతం 52డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ఢిల్లీ, పంజాబ్ లో కేంద్ర వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. పగలు ఎండలు ఎక్కువగా ఉంటాయని.. సాయంత్రం మాత్రం ఉపశమనం లభించొచ్చని ఐఎండీ తెలిపింది. అంతేకాకుండా సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని పేర్కొంది.

బయటకు వెళ్లొద్దు

ఇక ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున మధ్యాహ్నం సమయంలో ప్రజలు ఇంటి లోపలే ఉండాలని, కఠినమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నీరు ఎక్కువగా తాగాలని, తలతిరగడం, అలసట, గుండె కొట్టుకోవడం వంటి వడదెబ్బ లక్షణాల కోసం జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య అధికారులు ప్రజలను కోరారు. వేడిగాలులతో జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంది. చిన్న పిల్లలు, వృద్ధులు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అత్యవసర పరిస్థితులైతే తప్ప బయటకు వెళ్లొద్దని హెచ్చరించింది.

ఉత్తరాదిలో భానుడి భగభగలు

ఉత్తరాది రాష్ట్రాల్లో ఎండలు మండిపోతుంటే.. దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాలు చురుకుగా ఉన్నాయని ఐఎండీ అంచనా వేసింది. ఈ వారంలో ఆయా రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. జూన్ 20 నాటికి హిమాచల్ ప్రదేశ్‌కు, జూన్ 27 నాటికి పంజాబ్‌కు రుతుపవనాలు చేరుకుంటాయని అంచనా వేసింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006